


తనువొచ్చి అరగంట కావొస్తోంది.

వసంత ఇంకా రాదేం? చిరాకు పడసాగాడు మూర్తి. నిమిషం గడవటం యుగంగా కనిపిస్తోందతనికి. ఫానుకింద కూర్చున్నా స్వేదబిందువులు అదృశ్యం కావటంలేదు. ముఖం తుడుచుకున్నాడు. అసలే ఎండగావుంది. దానికితోడు ఊపిరి బిగపట్టుకు కూచున్నాడు. జీవితం అంతకీ సంబంధించిన సమస్య! నిర్ణయంకావాలి. ఏమవుతుందో!

లోపల ఏదో చప్పుడైంది. వసంత వొస్తున్నట్టుంది! మళ్ళీ ఓసారి ముఖం తుడుచుకుని ఎదురుగావున్న నిలువుటద్దంలో చూసుకున్నాడు. క్రాపు సర్దుకున్నాడు. షర్టుకాలరు సరిచేసుకున్నాడు. చిరునవ్వు అభినయించాడు. సోఫాలో చేరగిలబడి కాలుమీద కాలేసుకు కూచుని పోజు అద్దంలో చూసుకున్నాడు. 'బాగానే ఉన్నావులే, ఫరవాలేదు' అని అద్దం అభయహస్తం ఇచ్చింది.

వసంత ఇంకారాలేదు. విసుగుపుట్టింది అతనికి. ఎంతసేపు అలా కూచోటం? లేచాడు. ఏంచేయాలో తోచలేదు. గదినించి బయటమేడమీదకి వచ్చాడు. అంతగా జనసంచారం వుండేవీధి కాదది. ఏమీ తోచలేదు. మళ్ళీగదిలోకి వొచ్చాడు. పచారుచెయ్యటం ప్రారంభించాడు. కాని చప్పుడుకి వసంత ఏమైనా అనుకుంటుందేమోనని చప్పున ఆగాడు. షెల్ఫులోనించి ఓ పుస్తకంతీసుకుని మళ్ళీ సోఫాలో కూలబడ్డాడు. చదవ బుద్ధిపుట్టలేదు. ఉబుసుపోకకి పేజీలు తిప్పాడు. ఏదో

కాగితం కిందపడ్డది. తీశాడు. ఉత్తరంలా వుంది. తనకెందుకనుకుంటూనే అదే మిటో చూశాడు. ముచ్చెమటలుపోశాయి. ప్రేమలేఖ. ఎవరో? ఒకక్షణం అతనికి కళ్ళుతిరిగాయి. భవిష్యత్తు చీకటిగా కని పించింది. మరికాసేపటికి అతనికి పరి స్థితి కొద్దిగా అవగతమయింది. వసంతని తను కాక ఇంకెవరో ప్రేమిస్తున్నారనేది రూఢి. తనకావిషయంగురించి పూర్వం వున్న అనుమానం ఇప్పుడు బలపడ్డది. అతని ముఖం ఎర్రబడ్డది. వసంత ఆ ఉత్తరాన్ని చింపిపారేయకుండా అలా పుస్తకంలో దాచివుంచటం అతనికి గుండెల్లో రైళ్ల పరుగెత్తించింది. అంచే, ఆమె ఆ ప్రేమికుడు ఎవరినో నిర్లక్ష్యం చెయ్యటంలేదని స్పష్టం. మూర్తికి ముఖం జేవురించింది. కొంపతీసి వాడే ఆమె ప్రేమకి పాత్రుడు కాడుకదా! అతని ముఖంలో ఈర్ష్య తాండవించింది. దైన్యం మూర్తీభవించింది. నిస్పృహ ఆవరిం చింది సర్వస్వం పోగొట్టుకున్న వాడి లాగా సోఫాకి చేరగిలబడ్డాడు.


ఎదురుగావున్న నిలువుటద్దంలోకి శూన్యంగాచూశాడు. తటాలున అతను ముందుకు వంగాడు.

"ఎందుకా వెధవఏడుపు?"

ఈ మాటలు ఎవరూ అనలేదు. కాని ఎవరో అన్నట్టుగా అతనికి అనుభూతి కలిగింది. తనమీద తనకే ఏవగింపు కలి గింది. 'ఛీ' అనుకున్నాడు. ఒకక్షణంలో అతనిలో అంతకిపూర్వం కలిగిన భావ సంచలనం అదృశ్యమైంది.

ఆ ఉత్తరాన్ని మామూలు తెల్లకాగి తంగాచూశాడు. మళ్ళీదానిని పుస్తకంలో పెట్టేశాడు. ఒకవేళ వసంత ఆ ఉత్తరం రాసిన అతన్నే ప్రేమించేట్టయితే తను చేసేదేమీలేదు. అదృష్టం అతన్ని వరిం చిందన్నమాట ఈర్ష్యపడటం తెలివి తక్కువ. కాని అలా జరక్కుండా తనే మైనా చెయ్యగలడా? అంటే అతనికంటె తన ఆధిక్యత రుజువుచేసుకోగలడా? మూర్తి ఆలోచించాడు వసంతకి చెప్పాలి. ఎంతో నైపుణ్యంతో అనుభూతి అంది స్తున్నట్టుగా చెప్పాలి. నిజాయితీ వుట్టి పడేలా చెప్పాలి. తను ఆమెని హృదయ నైర్మల్యంతో ప్రేమిస్తున్నాడు. హృద యాధి దేవతగా ఆరాధిస్తున్నాడు. ఇది నిజం, అని ఆమె నమ్మాలి. నమ్మి తీరాలి. అలా తను చెప్పగలగాలి. ఆమె లేకపోతే తన జీవితం అంధకారసదృశం అని ఆమె తెలుసుకోగలగాలి. ఎలా? మాటలతో ఏమీ లాభంలేదు. ముఖంలో ఈ భావాలు ప్రస్ఫుటంకావాలి. దైన్యం, అసహాయత, ప్రేమ, ఆశ, నిరాశ ఇవన్నీ తాండవించాలి

మూర్తి ముఖం అద్దంలో చూసు కున్నాడు. మళ్ళీ, మళ్ళీ చూసుకున్నాడు. మూర్తీభవించిన దీనత్వంలా ఉంటేగాని ఆమె కరుణించదు. అలా ...మధ్య యుగంలోని ఇంగ్లీషు హీరోలు మోకాళ్ళ



మీద నుంచుని ప్రాధేయపడటం అతనికి జ్ఞాపకం వొచ్చింది. ఇంచుమించు అలా- అంతే...

"ఏమిటా వెధవమొహం?"

మూర్తికి వీపుమీద కొరడాతో కొట్టి నట్టయింది. తటాలున ముఖతంగిమలు అదృశ్యమయాయి సోఫాలో మామూలుగా కూర్చున్నాడు.

తలుపు చప్పుడైంది. ఆతృతగా అటువైపుచూశాడు. కర్టెన్ తొలగింది.

"చాలాసేపైనట్టుంది, వచ్చి?"

అంత ఎక్కువసేపు కాలేదని మాట వరసగా అనాలని అస్పష్టంగా గొణిగాడు మూర్తి. కనీసం ఇప్పటికైనా దర్శనం కలిగింది! ఒకక్షణం అటూ ఇటూ చూసి ఆమె ముఖంలోకి చూశాడతను. కొంప కూలింది! ఆమె తనచేతిలో పుస్తకం వైపు చూస్తోంది. ఎంత మతిమాలిన పని చేశాడు! అతను తనవైపు చూడటంతో వసంత దృష్టిమళ్ళించింది. ఆమెకు కోపం తెప్పించానని అతను మధనపడటం ప్రారంభించాడు. ఇవాళ అన్నీ తెలివి తక్కువపనులే చేస్తున్నాడు.

వసంత తాపీగా కుర్చీలో కూర్చుని అంది, 'పుస్తకం తిరగేస్తూ కూర్చున్నట్టున్నారు!'

అసలు పుస్తకం పేజీలు తిప్పలేదని అందామనుకున్నాడు. కాని అనలేకపోయాడు. అంటే మటుకు ఆమె నమ్మొద్దూ? పైగా అబద్ధాలకోరనే వాదు కొనితెచ్చుకోటం అవుతుంది. "ఊఁ" నసిగాడు.

కొన్నిక్షణాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి. వసంత ఏదో పత్రిక పేజీలు తిప్పుతోంది. ఆమె వైఖరిచూస్తేఇహ ఆశ పెట్టుకోటం అనవసరం అనుకోవొచ్చన్లేనే వుంది! తనంటే ఏమాత్రం లక్ష్యం వున్నట్టు ప్రవర్తించటంలేదు. అయినా చివరిదాకా ప్రయత్నం చెయ్యకతప్పదు, అన్నాడు.

"నేను వొచ్చినపని మీకు తెలుసనుకుంటాను."

"చెప్పందే ఎలా తెలుస్తుంది?"

"ఊహించివుంటా రనుకుంటాను."

"ఏదో ముఖ్యవిషయం మాట్లాడా లన్నారు."

మూర్తి ఉపోద్ఘాతం విరమించాడు. సూటిగా చెప్పాడు రెండుముక్కల్లో. తమ పరిచయంవల్ల తనకి ఆమెమీద ప్రేమ కలిగిందనీ, ఆమె ఒప్పుకుంటుందని ఆశిస్తున్నాననీ.

వసంత ఏమీ మాట్లాడలేదు. ఆమె ముఖంలోమటుకు అతనికి కొంచెం ఆశ్చర్యం కనిపించింది. అదే అతనికి అర్థంకాలేదు. ఈ పరిస్థితి వొస్తుందని ఆమె ఊహించలేదనుకోటం కల్ల. అతనామె వైపు ఆదుర్దాగా చూశాడు. వసంత మూర్తి వైపు ఓసారిచూసి తరవాత అతనిచేతిలో పుస్తకంవైపు చూసింది. ఎంతసేపటికీ ఆమె మాట్లాడలేదు. ఆ పుస్తకం అలా చూడటంతో మూర్తికి ఒళ్లుమండింది. అతన్ని అపహాస్యం చేస్తున్నట్టుగా ఫీలయాడు. ఏమిటి ఆమె అభిప్రాయం?

"మీ అభిప్రాయం నిర్మొహమాటంగా చెప్పొచ్చు."

అయినా ఆమె మాట్లాడలేదు. దిక్కులు చూడటం మళ్ళీ ఆ పుస్తకంవైపు చూడటం—మూర్తి ఉండబట్టలేకపోయాడు. కసిగా అన్నాడు.

"ఈ పుస్తకంలో ఉత్తరం నేను చూశాను. క్షమించాలి. యథాలాపంగా చూశాను. రహస్యం అనుకోలేదు."

వసంత ఒక్కక్షణం ఆగి అంది,

"అయితే, సరే."

ఏమిటామె వుద్దేశం? మూర్తి యిహ ప్రశ్నలేమీ అడగదలుచుకోలేదు అతనిలో సహనం చచ్చిపోయింది ఆమె ప్రవర్తన నిర్లక్ష్యభావం చూసి అతనికి అరికాలిమంట నెత్తికెక్కింది పుస్తకం ఆమె ముఖంమీద విసిరికొట్టాలని బలీయంగా అనిపించింది. కాని తమాయించుకున్నాడు. వెంటనే అక్కడినించి వెళ్ళిపోవటం శ్రేయస్కరం అనుకుని లేచాడు.

"వెడుతున్నారా?"

"ఉండండి. కొంచెం షర్బత్ తీసుకుని వెడుదురుగాని."

ఆమె మాటలు మామూలుగానే అంది. కాని మూర్తికి వెటకారంగా వినిపించాయి. వసంతలో యింత నైచ్యం, ఇంత దురహంకారం ఉన్నాయని తనెప్పుడూ అనుకోలేదు. తనని కీలుబొమ్మని ఆడించినట్టు ఆడిస్తోంది. మోసపోయాడు. అహంభావంతో యిన్నాళ్ళూ తనచుట్టూ తిప్పించుకుంది. తను మహా అందగత్తె అని గర్వం. అందం వుంటే వుండొచ్చు. కాని అంత మిడిసిపాటు దేనికి? అందంతో తనలాంటి వాళ్ళని ఉసిగొలిపి చివరికి ఎందుకూ పనికిరాని వాళ్ళనిగా, భగ్న హృదయులలాగా చేస్తే ఆమెకి ఒరిగేదేమిటి? తనలాంటివాళ్ళు తలుచుకుంటే... మూర్తి తనని తను మర్చిపోయాడు ఉక్రోషంతో సర్వం మర్చిపోయాడు. వసంత షర్బత్తు కలపటంలో నిమగ్నురాలయింది. ఆమెవైపు మత్తెక్కిన కళ్ళతో చూశాడు. నఖశిఖపర్యంతం చూశాడు. ఒక అడుగు ముందుకు వేశాడు...సమీపిస్తున్నాడు.. ఒక్కసారి చుట్టూచూశాడు అరె! ఎవతిదాముఖం? భీకరంగా, పైశాచికంగా, నెత్తురులా ఎర్రగా...మూర్తి అదిరిపడ్డాడు. ఆ ముఖం, ఒకక్షణం గుండె ఆగిపోయినట్టనిపించిం దతనికి. ఆ పైశాచికవదనం!...కాదు. కాదు—మనిషే! అమ్మయ్య. మూర్తికి మనసు మనసులో లేదు. తటాలున అతనికి పరిస్థితి అర్థమైంది. గిరుక్కున వెనక్కి తిరిగాడు.

వసంత షర్బత్ కలిపి వెనక్కి తిరిగి చూసింది. మూర్తి లేదు. ఎదురుగా నిలువుటద్దంలో కనిపించింది—మూర్తి గబగబా వెళ్ళిపోతున్నాడు.

'మూర్తిగారూ'

అతను వినిపించుకునే స్థితిలోలేదు. భుజంమీద చెయ్యిపడ్డది. వసంత! అతని ముఖం వివర్ణమౌతోంది.

"అంత కోపమైతే ఎలా?

అతను సమాధానంచెప్పేస్థితిలోలేదు.

"రండి."

వెనక్కితిరిగితే—!

రుమాలు అడ్డంపెట్టుకుని అప్రయత్నంగా నడిచాడు మళ్ళీ గదిలోకి. ఎదురుగా నిలువుటద్దంలో — పాలిపోయిన ముఖం. పక్కన సహజసుందర వదనారవిందం.

"లైఫ్‌సైజ్ ఫోటోలా వుందికదూ!"

ఒకక్షణం అతనికి వసంత మాటలు అర్థంకాలేదు. తరవాత ఆమెవైపు అనుమానంగా చూశాడు. ఆమె చిరునవ్వు నవ్వింది.

"ఆ ఉత్తరం శుద్ధకల్పితం. మిమ్మల్ని పరీక్షించటానికి నేనేరాశాను. నేనురావటం ఆలస్యంచేస్తే మీరాపుస్తకం తీస్తారని నాకుతెలుసు. కాని ఎంత నిబ్బరమండీ మీకు! అంత నిస్పృహని ఎలా అణచిపెట్టుకున్నారు! పల్లెత్తుమాట అనలేదు. ఈర్ష్యపడలేదు కాని ఎంత నిరాశపడ్డారో మీ ముఖంచూస్తేనే తెలుస్తోంది. మిమ్మల్ని ఒప్పుకోననుకున్నారా?"

ఏమిటేమిటో అంటోంది వసంత. అద్దంలో ఇద్దరినీచూసి మందంగానవ్వాడు మూర్తి. కాని అతనికా అద్దమే ముసిముసిగా నవ్వినట్టనిపించింది.